కృత్రిమ వీర్యం.. నచ్చిన రూపం!

న్యూఢిల్లీ: శృంగారంలో పాల్గొనాల్సిన అవసరం లేకుండానే సంతానాన్ని పొందే రోజులు త్వరలో రాబోతున్నాయి. దీంతో స్వలింగ జంటలు సైతం సంతాన భాగ్యాన్ని పొందేందుకు వీలవుతుంది. ఈ అసాధ్యం వచ్చే పదేండ్ల లోగా సుసాధ్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మానవ వీర్యాన్ని, అండాలను ప్రయోగశాలలో వృద్ధి చేసే ప్రక్రియకు శాస్త్రవేత్తలు ఇప్పటికే చేరువైనట్టు మానవ ఫలదీకరణ, పిండోత్పత్తి శాస్త్ర(హెచ్ఎఫ్ఈఏ) బోర్డు గత వారం నిర్వహించిన సమావేశంలో ప్రకటించింది. మానవ ఫలదీకరణ, పిండ శాస్త్రానికి సంబంధించిన చట్టాన్ని ఆధునీకరించేందుకు 2023లో కొన్ని ప్రతిపాదనలు చేసిన హెచ్ఎఫ్ఈఏ.. ల్యాబ్‌లో మానవ వీర్యాన్ని, అండాలను వృద్ధి చేయడాన్ని వైజ్ఞానిక రంగం సాధించిన విప్లవాత్మక పురోగతిగా అభివర్ణించింది. నైతికంగా ఇది ఎంతో వివాదాస్పదమైన పురోగతే అయినప్పటికీ దీన్ని వినియోగించుకోవడం వల్ల ఎన్నో లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నట్టు స్పష్టం చేసింది. ల్యాబ్‌లో పెంచిన అండాలు, వీర్యం సాయంతో తల్లిదండ్రులు తమ భవిష్యత్తు సంతానాన్ని నచ్చినట్టుగా కస్టమైజ్(అభిరుచికి తగిన మార్పులు) చేసుకోవచ్చని తెలిపింది. శాస్త్రవేత్తలు ఇప్పటికే ఈ పద్ధతిలో ఎలుకల నుంచి కొన్ని పిల్లలను, జీవ సంబంధీకులైన ఇద్దరు తండ్రుల నుంచి ఓ బిడ్డను ఉత్పత్తి చేశారని హెచ్ఎఫ్ఈఏ వెల్లడించింది.

'మంచు' శిల్పకళలో మనకు కాంస్యం

అమెరికాలోని కొలరాడోలో జరుగుతున్న 2025 'అంతర్జాతీయ మంచు శిల్పకళా చాంపియన్‌షిప్' పోటీల్లో మనవాళ్లు సత్తా చాటారు. 'మైండ్ ఇన్ మెడిటేషన్' థీమ్‌తో భారత కళాకారుల బృందం చెక్కిన మంచు శిల్పాలు అంతర్జాతీయ వేదికపై 'కాంస్య' పతకాన్ని గెలుచుకున్నాయి. జర్మనీ, మెక్సికో..మొదటి, రెండో స్థానంలో నిలిచాయి.

విష లోహాల్ని గుర్తించే నానో మెటీరియల్స్

న్యూఢిల్లీ : మన చుట్టూ ఉన్న జీవ వ్యవస్థలో విషపూరిత లోహాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా పాదరసం(మెర్క్యూరీ) పర్యావరణం, జీవ కణాల్లోకి చొచ్చుకెళ్లిందంటే చాలా ప్రమాదకరం. దీనిని గుర్తించేందుకు ఐఐటీ-గువహటి పరిశోధకులు ఓ వినూత్న పద్ధతిలో నానో మెటీరియల్స్‌ను అభివృద్ధి చేశారు. జీవ సంబంధమైన వ్యవస్థల్లో లోహాల విష ప్రభావాన్ని, వ్యాధి నిర్ధారణకు తమ పరిశోధన దోహదపడుతుందని, అంతేగాక పర్యావరణ పర్యవేక్షణలో ఈ ఆవిష్కరణ విప్లవాత్మక మార్పులకు దారి తీస్తుందని వారు చెబుతున్నారు. ఈ పరిశోధన వివరాలు జర్నల్ ఆఫ్ మెటీరియల్స్ కెమెస్ట్రీ, మెటీరియల్స్ టుడే కెమిస్ట్రీలో ప్రచురితమయ్యాయి. దీనిపై ఐఐటీ-గౌహతీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సైకత్ భౌమిక్ మాట్లాడుతూ, 'కలుషిత ఆహారం, నీరు, గాలి పీల్చినప్పుడు లేదా చర్మం ద్వారా పాదరసం శరీరంలోపలికి చేరితే చాలా ప్రమాదకరం. దీనివల్ల నాడీ వ్యవస్థ దెబ్బ తినటం, అవయవాలు పనిచేయకపోవటం..మొదలైన తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. మన చుట్టూ ఉన్న జీవ వ్యవస్థలో పాదరసం వంటి విషపూరిత లోహాల్ని గుర్తించటం చాలా కీలకం. దీనికి నానోక్రిస్టల్ చాలా ముఖ్య భూమిక వహిస్తాయి' అని చెప్పారు.

మానస్ సరోవర్ యాత్ర పునరుద్ధరణ

చైనా-భారత్ మధ్య ఇక నేరుగా విమానాలు

న్యూఢిల్లీ: ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టపరిచే చర్యలలో భాగంగా 2020 నుంచి నిలిపివేసిన కైలాశ్ మానస్ సరోవర్ యాత్రను 2025 వేసవి నుంచి పునరుద్ధరించాలని భారత్, చైనా నిర్ణయించాయి. అంతేగాక రెండు దేశాల మధ్య నేరుగా నడిచే విమానాలను మళ్లీ నడపాలని కూడా ఉభయ దేశాలు నిర్ణయించాయి. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య సోమవారం బీజింగ్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. నదీ జలాల పరిమాణానికి చెందిన వివరాల బదిలీ నిబంధన పునరుద్ధరణపై ఉభయ దేశాల నిపుణుల స్థాయి సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.

సిద్ధరామయ్య భార్యకు ఈడీ నోటీసులు

ముడా కేసులో పిలుపు.. వెంటనే హైకోర్ట్ స్టే

బెంగళూరు: మైసూరు అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూకుంభకోణం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి, కర్ణాటక మంత్రి బైరతి సురేశ్‌కు ఈడీ సోమవారం నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో విచారణ కోసం మంగళవారం బెంగళూరులోని తమ కార్యాలయానికి రావాలని పార్వతిని ఈడీ పిలిచింది. అయితే, ఈడీ నోటీసులపై పార్వతి, మంత్రి హైకోర్టును ఆశ్రయించారు. నోటీసులపై సోమవారం హైకోర్టు స్టే ఇవ్వడంతో వీరికి తాత్కాలిక ఊరట లభించింది. మరోవైపు ముడా భూ కుంభకోణాన్ని విచారించిన కర్ణాటక లోకాయుక్త పోలీసులు సోమవారం హైకోర్టు ధర్వాడ్ బెంచ్‌కి విచారణ నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించారు. కాగా, ముడా కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం వాదనలు కొనసాగాయి. జస్టిస్ ఎం నాగప్రసన్న తీర్పును రిజర్వ్ చేశారు.

సమాజంలో మార్పు రావాల్సిందే

- వరకట్న, గృహహింస చట్టాల దుర్వినియోగంపై పిల్
- విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రస్తుతం ఉన్న వరకట్న, గృహ హింస చట్టాల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఆయా చట్టాలను సమీక్షించి, సంస్కరించేందుకు ఒక నిపుణుల కమిటీని నియమించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని అనుమతించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. సమాజం మారాలని, ఈ విషయంలో తాము ఏమీ చేయలేమని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిల్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరిస్తూ, 'సమాజంలో మార్పు రావాల్సిందే ఈ విషయంలో మేము ఏమీ చేయలేము. ఇందుకు తగ్గ పార్లమెంటరీ చట్టాలు ఉన్నాయి' అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. ఇటీవల బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్య ఘటన నేపథ్యంలో దుర్వినియోగం అవుతున్న గృహహింస చట్టాలలో పిటిషన్‌దారు సంస్కరణలను కోరారు. పెండ్లి సమయంలో ఇచ్చే బహుమతులు, వస్తువులు, నగదుకు సంబంధించిన జాబితాను తయారుచేసి వాటిని అఫిడవిట్ రూపంలో రికార్డు చేసి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో జత చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా పిటిషనర్ కోరారు. వరకట్న నిషేధ చట్టం, ఐపీసీలోని 498ఎ సెక్షన్ వరకట్న కోరికలు, వేధింపుల నుంచి వివాహిత మహిళకు రక్షణ కల్పిస్తాయి. అయితే ఈ చట్టాలు భార్యభర్తల మధ్య వేరే విషయంలో మనస్పర్థలు తలెత్తిన పుడు భర్త కుటుంబంపై కక్షసాధించేందుకు ఈ చట్టాలను ఆయుధంగా మలచుకుంటున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ చట్టాల కింద పెళ్లైన మగవారిపై కొన్నిసార్లు తప్పుడు కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. వరకట్నం కేసుల్లో చాలా మంది పురుషులపై తప్పుడు అభియోగాలు నమోదవుతున్నాయని, ఇవి విషాదాంత పరిస్థితులకు దారి తీస్తున్నాయని పిటిషనర్ తెలిపారు. ఇది మన న్యాయ, క్రిమినల్ దర్యాప్తు విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆయన తెలిపారు. వరకట్నం, గృహ హింస చట్టాల దుర్వినియోగం కారణంగా ఆ చట్టాలను రూపొందించడం వెనుక గల గొప్ప ఉద్దేశాలు ఓడిపోతున్నాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు.

గురుద్వారాల్లోనూ సోదాలు

న్యూయార్క్, న్యూజెర్సీల్లో అక్రమ వలసదారుల వేట • సిక్కు సంఘాల ఆగ్రహం

వాషింగ్టన్, బొగోటా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారుల వేటలో కఠినంగా ఉన్నారు. ఆయన ఆదేశాలతో తాజాగా అమెరికన్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఏజెంట్లు రంగంలోకి దిగారు. అక్రమ వలసదారులను గుర్తించేందుకు న్యూయార్క్, న్యూజెర్సీలలోని గురుద్వారాల్లో తనిఖీలు ప్రారంభించారు. ఈ పరిణామాలు తమ మత పవిత్రతకు భంగకరమని సిక్కు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సిక్కు వేర్పాటువాదులు, అక్రమ వలసదారులకు కొన్ని గురుద్వారాలు అడ్డాగా పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దవాఖానలు, గురుద్వారాలు, చర్చ్‌లు వంటి పార్థనా స్థలాలను, వాటి సమీప ప్రాంతాలను సున్నితమైనవిగా గతంలో బైడెన్ సర్కారు ప్రకటించింది. అయితే ట్రంప్ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది గంటల్లోనే హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఆ అదేశాలను రద్దు చేసింది. ఈ పరిణామాలపై సిక్కు అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ ఆదేశాల వల్ల గురుద్వారాలలో తనిఖీలు, అరెస్టులు జరుగుతాయనే భావాన్ని సిక్కులు ఆమోదించలేరని తెలిపింది. ప్రభుత్వ నిధూ వల్ల సిక్కులు గురుద్వారాలకు హాజరు కావడం తగ్గుతుందని, తమ మతపరమైన ఆచారాలను అర్థవంతంగా ఆచరించలేరని ఆవేదన వ్యక్తం చేసింది.

ట్రంప్ హెచ్చరికలతో దిగొచ్చిన కొలంబియా

అమెరికా నుంచి పంపిన అక్రమ వలసదారుల విమానాలను తిప్పి పంపిన కొలంబియాపై అమెరికా ప్రభుత్వం విజయం సాధించినట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. తమతో దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉన్న కొలంబియాపై భారీ దిగుమతి సుంకాలు, ఆర్థిక ఆంక్షలు విధిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే కొలంబియా తన నిర్ణయాన్ని మార్చుకుందని తెలిపింది. తాము పంపిన వలసదారుల విమానాలను స్వీకరించడానికి కొలంబియా అంగీకరించిందని వెల్లడించింది.

ప్రశంసలు పొందిన చోటే ఎగతాళి!

అమెరికాలో ఉన్న భారతీయులను ఆదర్శప్రాయులైన వలసదారులుగా పరిగణిస్తారు. వారిని సమస్యలకు పరిష్కారం చూపేవారిగా వ్యవహరిస్తారు. అయితే, ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) మద్దతుదారులు అమెరికాలోని భారతీయులపై సామాజిక మాధ్యమాల్లో రెచ్చిపోతున్నారు. హెచ్-1బీ వంటి వీసాలపై వచ్చి, తమకు ఉద్యోగాలు దక్కనీయడం లేదనే అపోహతో మాగా మద్దతుదారులు సామాజిక మాధ్యమాల్లో భారతీయులకు వ్యతిరేకంగా అసహనంతో పోస్టులు పెడుతున్నారు. అయితే ఇలాంటి ఎగతాళికి కొందరు అమెరికన్లు ఘాటైన సమాధానం ఇచ్చారు. భారతీయులంతా హెచ్-1బీ వీసాలపై వచ్చినవారు కాదని, హెచ్-1బీతో వచ్చినవారంతా భారతీయులు కాదని చెప్పారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్ సెషన్ 1

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్ సెషన్ 1ని మంగళవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో పరీక్షలకు హాజరు కావాల్సిన అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఈ పరీక్షల్లో తొలి సెట్ ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగాయి. తదుపరి సెట్ పరీక్షలు ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరుగుతాయి. అడ్మిట్ కార్డులపై నిర్దేశించిన సమయానికి పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు హాజరు కావాలి. తలుపులు మూసేసిన తర్వాత అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి ప్రవేశించేందుకు అనుమతి ఇవ్వరు.

వాట్సాప్‌లో నోటీసులు పంపొద్దు

చట్టంలో వీల్లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వాట్సాప్, ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో నిందితులకు నోటీసులు పంపించడం చట్ట ప్రకారం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పోలీసులు నిందితులకు వాట్సాప్‌లో నోటీసులు పంపుతున్న విషయాన్ని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చట్ట ప్రకారం నోటీసులు నేరుగా వ్యక్తులకు అందివ్వాలని ఆయన పేర్కొన్నారు. వాట్సాప్, ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా నోటీసులు పంపించవచ్చని హర్యానా డీజీపీ పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఎలక్ట్రానిక్ పద్ధతిలో నోటీసులు పంపొద్దని కేంద్రం, రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఇరాన్ ఏఐ క్షిపణుల ప్రయోగం

టెహ్రాన్: పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత నేపథ్యంలో ఆయుధాల విషయంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఇరాన్ దూకుడుగా వ్యవహరిస్తున్నది. ఏఐ సాంకేతికతో కూడిన క్షిపణులను తాజాగా ఆ దేశం విజయవంతంగా ప్రయోగించింది. నైరుతి ఇరాన్‌లోని గల్ఫ్ జలాల్లో జరుగుతున్న డ్రిల్స్‌లో ఏఐ సాయంతో పనిచేసే ఆయుధాలను ఇరాన్ ఆర్మీ ప్రయోగించినట్టు ఆ దేశ అధికారిక మీడియా ఐఆర్ఎన్ఏ వెల్లడించింది. అడ్వాన్స్‌డ్ డ్రోన్ల సాయంతో క్షిపణులను ప్రయోగించినట్టు, అవి నిర్దేశిత లక్ష్యాలను చేధించినట్టు తెలిపింది.

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలు

చట్టం చేసిన మొదటి రాష్ట్రంగా గుర్తింపు

డెహ్రాడూన్: దేశంలో మొదటిసారిగా ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వివాహాలు, విడాకులు, సహజీవనాలను నమోదు చేసుకునేందుకు రూపొందించిన యూసీసీ పోర్టల్‌ను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆవిష్కరించారు. ఉత్తరాఖండ్‌తో పాటు రాష్ట్రం బయట నివసిస్తున్న ఉత్తరాఖండ్‌వాసులకు యూసీసీ వర్తిస్తుంది. అయితే, షెడ్యూల్డ్ తెగలకు మాత్రం వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. యూసీసీతో బహుభార్యత్వం, బాల్య వివాహాలు, త్రిపుల్ తలాఖ్ వంటి దురాచారాలను రూపుమాపవచ్చని సీఎం పేర్కొన్నారు.

ఆఫ్ఘన్‌లో 'అర్ధాకలి'

నిలిచిన విదేశాల సాయం

తాలిబన్ల పాలన దుర్భరం: ఐరాస

ఇస్లామాబాద్, జనవరి 27: తాలిబన్ల పాలనలో అఫ్ఘనిస్థాన్ ఆర్థిక సంక్షోభం తారాస్థాయికి చేరింది. 2021లో తాలిబన్లు పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ దేశ ప్రజానీకం రోజురోజుకూ దుర్భర పరిస్థితుల్లో మగ్గిపోవాల్సి వస్తున్నది. అంతర్జాతీయంగా అభివృద్ధి, భద్రతా పరమైన అవసరాలకు సహకారం కరువైంది. అఫ్ఘనిస్థాన్ మానవీయ ప్రణాళిక అమలుకు కూడా నోచుకోవడం లేదని ఐక్యరాజ్య సమితి(ఐరాస) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో ప్రణాళిక ద్వారా కేవలం 50 శాతం నిధులు మాత్రమే అందాయని ఐరాస పేర్కొంది. విదేశాల నిధులు ప్రభుత్వాలకు సంబంధం లేకుండా ఎన్జీవోల ద్వారా నేరుగా లబ్ధి చేకూర్చేందుకు వీలు కలుగుతుంది. గతంలో సాయం చేసిన దాతలు కూడా ఈ సారి సాయంలో కోతలు విధించుకున్నారు. ప్రపంచ ఆహార కార్యక్రమం(డబ్ల్యూఎఫ్‌పీ)లో భాగమైన మానవీయ సాయం అందకపోవడంతో సుమారు 1.5 కోట్ల ఆకలితో అలమటిస్తున్నారని, ప్రజానీకం బ్రెడ్, టీతో కడుపు నింపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దేశంలో 1, 2 పూటలు తింటున్న ప్రజల సంఖ్య 60 లక్షలకు పైగానే ఉంటున్నదని పేర్కొంది.

మహారాష్ట్రలో జీబీఎస్ కలకలం

మొదటిపేజీ తరువాయి...

ఇన్ఫెక్షన్ ధ్రువీకరించారు. పూణెలో 24 గంటల్లో కొత్తగా 28 కేసులు నమోదయ్యాయి.16 మంది వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. రోగుల నుంచి సేకరించిన కొన్ని శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించగా, అందులో క్యాంపిలో బాక్టర్ జెజుని బ్యాక్టీరియా ఉన్నట్లు వెల్లడైంది. అది అత్యంత తీవ్రమైన అంటు వ్యాధి కావడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. పూణెలో ప్రధాన నీటి వనరైన ఖడక్ వాసలా డ్యామ్ సమీపంలోని ఓ బావిలో ఈ-కోలి అనే బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నట్లు శనివారం విడుదలైన ల్యాబ్ టెస్ట్ ఫలితాలు వెల్లడించాయి. అయితే ఆ బావిని అసలు వినియోగిస్తున్నారా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పూణెకు తాగునీటిని అందిస్తున్న ప్రధాన జలాశయంలోని నీటిని పరీక్షలకు పంపించారు.దీంతో పూణె ప్రజలు బాగా మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తోంది. ఈ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వ దవాఖానలలో ఉచితంగా చికిత్స చేయిస్తామని మహారాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ ప్రకటించారు. జీబీఎస్ కేసుల కట్టడి కోసం మహారాష్ట్రకు సహకరించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ ఏడుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల బృందాన్ని పంపించింది.

అత్యంత అరుదైన వ్యాధి

జీబీఎస్ అత్యంత అరుదైన వ్యాధి. జీబీఎస్ ప్రపంచంలో మూడోవంతు మరణాలకు కారణమవుతుందని వైద్యులు తెలిపారు. ఇది సంక్రమించినవారి రోగ నిరోధక వ్యవస్థ దెబ్బ తింటుంది. బ్యాక్టీరియల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకినవారికి ఇది త్వరగా వస్తుంది. ఈ వ్యాధి వల్ల నీరసం, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. మెదడు సంకేతాలను శరీరంలోని వివిధ విభాగాలకు తీసుకెళ్లే నరాలపై దాడి చేస్తుంది. బలహీనపరుస్తుంది. దీనికి చికిత్సలో సుమారు రూ.20 వేల విలువైన ఇంజెక్షన్లను వాడాల్సి ఉంటుంది. బాధిత రోగులలో 80 శాతం మంది డిశ్చార్జి అయిన 6 నెలలోపు కోలుకుని నడవగల సామర్థ్యం పొందుతారని వైద్యులు వెల్లడించారు.

పాముకాట్లపై చర్యలు తీసుకోండి

- రాష్ట్రాలతో కలిసి పని చేయండి
- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పాముకాట్ల సమస్య ప్రబలంగా ఉందని, దవాఖానల్లో పాముకాటు బాధితుల చికిత్సను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రాలతో కలిసి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాముకాట్ల బాధితులకు సరైన చికిత్స అందడం లేదని పేర్కొంటూ న్యాయవాది చాంద్ ఖురేషీ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్ట్ ధర్మాసనం విచారించింది. పాముకాట్లతో సంభవిస్తున్న మరణాల రేటు భారత్‌లోనే అత్యధికంగా ఉందని పిటిషన్‌దారుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాముకాటు చికిత్సకు ఇచ్చే యాంటీ-వీనొమ్ అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. పిటిషన్‌పై స్పందించిన ధర్మాసనం.. 'సమస్య దేశమంతా ఉంది. రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించండి. పాముకాట్ల చికిత్సకు ఏమైనా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించండి' అని కేంద్ర ప్రభుత్వం తరపు న్యాయవాదికి సూచించింది.

వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

విపక్ష ఎంపీల ప్రతిపాదనల తిరస్కరణ

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లును కొన్ని సిఫారసులతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సోమవారం ఆమోదించింది. ఈ కమిటీ సమావేశం అనంతరం చైర్మన్ జగదాంబిక పాల్ మీడియాతో మాట్లాడుతూ, తమ కమిటీ ఆమోదించిన సవరణలు ఈ బిల్లును మరింత సమర్థంగా, సమగ్రంగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. ఈ బిల్లులోని 14 క్లాజులకు ఎన్డీయే ఎంపీలు ప్రతిపాదించిన సవరణలకు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ బిల్లులోని అన్ని (44) క్లాజులకు విపక్ష సభ్యులు వందలాది సవరణలను ప్రతిపాదించారని, వాటిని ఓటింగ్ ద్వారా కమిటీ తిరస్కరించిందని చెప్పారు. అయితే దీనిపై ప్రతిపక్షాల ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జేపీసీ చైర్మన్ ప్రజాస్వామిక ప్రక్రియను తుంగలో తొక్కారని మండిపడ్డారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విలేకర్లతో మాట్లాడుతూ, ఇదంతా ఓ ప్రహసనమన్నారు. తాము చెప్పిన దానిని చైర్మన్ వినలేదన్నారు. పాల్ నియంతృత్వ ధోరణితో వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే జేపీసీలో మెజారిటీ అభిప్రాయానిదే పైచేయి అని పాల్ తెలిపారు. మతపరమైన కార్యకలాపాల కోసం ఉపయోగించడాన్ని బట్టి వక్ఫ్ అనే దాని ఆధారంగా ప్రస్తుత వక్ఫ్ ఆస్తులను ప్రశ్నించరాదని ప్రస్తుత బిల్లులో ఉంది. దీనిని కొత్త బిల్లులో తొలగించాలని జేపీసీ కీలక ప్రతిపాదన చేసింది. ఈ సవరణలతో కూడిన వక్ఫ్ సవరణ బిల్లుకు ఈ నెల 29న తుది రూపం ఇచ్చి, ఈ నెల 31న లోక్ సభకు సమర్పించనున్నట్లు సమాచారం.

మిన్నంటిన ప్రయాగ్‌రాజ్ విమాన చార్జీలు

న్యూఢిల్లీ: మహా కుంభమేళా కొనసాగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు విమాన చార్జీలు హఠాత్తుగా పెరిగాయి. దీంతో కేంద్రం సోమవారం వివిధ ఎయిర్‌లైన్స్‌తో అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఈ నెల 29న మౌని అమావాస్య(రాజ స్నానం చేసే దినం) ఉన్న దరిమిలా వివిధ నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు విమాన చార్జీలు ఒక్కసారి ఆకాశాన్నంటాయి. ట్రావెల్ పోర్టల్స్‌లో, జనవరి 28న చైన్నై-ప్రయాగ్‌రాజ్‌కు, రెండు రోజుల రిటర్న్ జర్నీ టిక్కెట్ ఛార్జీ రూ. 53,000 ఉంది. కోల్‌కతా నుంచి రిటర్న్ టికెట్ రూ.35,500గా ఉంది. హైదరాబాద్/ముంబై/ఢిల్లీ టికెట్ రూ.47,500 దాటగా బెంగళూరు నుంచి రూ.51,000 పలుకుతోంది.

ఇక.. దేశమంతా ఒకే సమయం!

ప్రభుత్వ ముసాయిదా నిబంధనలు సిద్ధం



న్యూఢిల్లీ, జనవరి 27: సమయపాలనను ప్రామాణికం చేసే చర్యలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అన్ని అధికారిక, వాణిజ్య వేదికల వ్యాప్తంగా భారతీయ కాలమానాన్ని(ఐఎస్‌టీ) మాత్రమే ఉపయోగించడాన్ని తప్పనిసరి చేసేందుకు సమగ్రమైన నిబంధనలను ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 14 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలను కేంద్ర వినిమయ వ్యవహారాల శాఖ కోరింది. న్యాయ, పరిపాలన, వాణిజ్య, అధికారిక పత్రాలకు ఐఎస్‌టీని మాత్రమే ఏకైక ప్రామాణిక కాలమానంగా పాటించేందుకు ఒక న్యాయపరమైన స్వరూపాన్ని నెలకొల్పాలని లీగల్ మెట్రాలజీ(ఇండియన్ స్టాండర్డ్ టైమ్) రూల్స్, 2024 ఆశిస్తున్నాయి. వాణిజ్యం, రవాణా, ప్రజా పాలన, లీగల్ కాంట్రాక్టులు, ఆర్థిక కార్యకలాపాలతో సహా అన్ని రంగాలలో భారతీయ కాలమానాన్ని తప్పనిసరిగా ఉపయోగించాలని ముసాయిదా నిబంధనలు చెబుతున్నాయి. అధికారిక, వాణిజ్య అవసరాల కోసం ఐఎస్‌టీ కాకుండా వేరే కాలమానాలను సమయానికి సూచనగా ప్రస్తావించడాన్ని నిషేధించడంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో ఐఎస్‌టీని ప్రదర్శించడం తప్పనిసరి అని ముసాయిదా నిబంధనలు తెలిపాయి. టెలీ కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్, రక్షణతో సహా కీలక జాతీయ మౌలిక సదుపాయాల రంగాలతోపాటు రానున్న 5జీ, కృత్రిమ మేధ వంటి కొత్త సాంకేతిక రంగాలలో నిర్దిష్టమైన సమయపాలనను పాటించేలా చూడడమే ఈ ప్రతిపాదన ప్రధాన ఉద్దేశం. ఖగోళ శాస్త్రం, సముద్రయానం, శాస్త్రీయ పరిశోధనలు, ప్రభుత్వ ముందస్తు అనుమతి ఉన్న రంగాలకు మాత్రం ఇందులో నుంచి మినహాయింపు ఉంటుందని ఆయన చెప్పారు.

గ్రహ శకలాన్ని కనుగొన్న విద్యార్థి

న్యూఢిల్లీ: అంతరిక్షంలో ఇప్పటివరకు ఎవరికీ తెలియని ఓ గ్రహ శకలం(ఆస్టరాయిడ్)ను గుర్తించిన తొమ్మిదో తరగతి విద్యార్థి అందరి చేతా 'శభాష్!' అనిపించుకున్నాడు. ఉత్తరప్రదేశ్ నోయిడా నగరంలోని శివ్ నాడార్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి దక్ష్ మాలిక్ చేసిన కృషిని 'నాసా' గుర్తించింది. 'ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ డిస్కవరీ ప్రాజెక్ట్'లో పాలుపంచుకున్న దక్ష్ మాలిక్ కొత్త ఆస్టరాయిడ